కథా నిలయం
4978
శ్రీకాకుళం

# తరాలు-అంతరాలు

దాదాపు పదిహేను సంవత్సరాల తర్వాత మా ఊరి గడ్డమీద కాలు పెట్టబోతున్నాను. ఊరు దగ్గిరౌతుంటే, చిన్ననాటి స్మృతులుకూడా మనస్సుకు చేరువవుతున్నాయి. ఉద్యోగరీత్యా ఢిల్లీలో ఉంటున్న నేను ఈ పదిహేను ఏళ్ళల్లో ఒక్కసారికూడా మా ఊరు రాలేదు. కారణం మా ఊరంటే నాకు పెద్దగా అభిమానం లేదు. ఆ ఊరు నాకు ఏమీ యివ్వలేదు. బాల్య జీవితం తాలూకు స్మృతులు బాధనే కలిగిస్తాయి. ఒక విధంగా మా పల్లెటూరి జీవితాన్ని తలుచుకొని, ఆ ఊళ్ళో నన్ను ఎలా స్వీకరిస్తారోనని భయం కలిగింది.

నా చిన్నప్పుడు మా ఊళ్ళో ముఖ్యంగా మా కులం వాళ్ళు ఒంటెద్దు బండికిగ్గానీ, గుర్రబ్బండిగ్గానీ తెరలు కట్టుకోకుండా ఆడవాళ్ళు బయలుదేరేవారు కాదు. నేను మాత్రం ఏది ఏమయినా తెరలు కట్టుకొని వెళ్ళకూడదనుకున్నాను. వేజెండ్ల స్టేషన్‌లో దిగి గుర్రబ్బండి కట్టించుకొని బయలుదేరాను. అందరూ నాకేసి చిత్రంగానూ, నిరసనగానూ చూస్తారని నాకు తెలుసు.  అసలు నేను కష్టపడి ప్రైవేటుగా మెట్రిక్ పాసయి ఉద్యోగానికి వెళుతున్నానంటే అందరూ తలోరకంగా నిందించారు. చెయ్యరాని మహాపరాధం ఏదో చేస్తున్నట్లు భావించారు. అందుకే నాకు ఆ ఊరంటే భయం. ఉద్యోగానికి వెళ్ళిన కొత్తలో ఒకసారి కాబోలు మా ఊరికి వచ్చాను. నా చిన్ననాటి స్నేహితురాళ్ళుకూడా కళ్ళు పెద్దవి చేసుకొని వింత జంతువును చూసినట్లు చూశారు. అంతే- మళ్లీ ఆ ఊళ్ళో అడుగుపెట్టలేదు.

బండి ఊళ్ళో ప్రవేశించింది. ఆ బజారు నాకు సుపరిచితమైందిగా తోచలేదు. ఎన్నో మేడలు, దుకాణాలు లేచాయి. ముఖ్యంగా తెరలేని బండిని ఎవరూ నోళ్లు తెరుచుకొని చిత్రంగా చూట్టంలేదు. బజారులోకూడా రద్దీ ఎక్కువగానేవుంది. వూరు బాగా పెరిగినట్టనిపించింది. ముఖ్యంగా నన్ను ఆశ్చర్యపరచిన దృశ్యం-రోడ్డుకు అవతలవైపునుంచి వయస్సులోవున్న ఆడపిల్లలు పుస్తకాలు చేతుల్లో పట్టుకుని నిశ్చింతగా, హాయిగా కబుర్లు చెప్పుకుంటూ నడవడం.

ఇరవై సంవత్సరాలక్రితం అదే స్కూలు అక్కడే వుండేది. అప్పుడది మిడిల్ స్కూల్. ఇప్పుడు హైస్కూలు. తేడా ఇంతే! మధ్యలో ఇరవై సంవత్సరాల కాలం మాత్రం తన ప్రభావాన్ని విడిచి వెళ్ళిపోయింది. నాకు చిన్నతనంలో బాగా చదువుకోవాలనే అభిలాష ఉండేది. బస్తీకెళ్ళి కాలేజీలో చదవాలనీ, బాడ్‌మింటన్ ఆడాలనీ, ఉద్యోగం చెయ్యాలనీ, ఏవేవో, ఎన్నెన్నో తెలిసీ తెలియని వయసులో కలలు కన్నాను. వీధిబడి చదువుతోనే

యింట్లో కూర్చోవలసి వచ్చింది. కనీసం వూళ్ళో ఉన్న స్కూల్లో థర్డుఫారంవరకయినా చదివితీరతానని పట్టుపట్టాను. ఏడ్చాను. కాని ఫలితం లేకపోయింది. పదేళ్లువచ్చిన ఆడపిల్ల రోడ్డు అవతలవున్న స్కూలుకు వెళ్ళి చదువుకోవటం మన యింటా వంటా లేనిపని అంటూ పెద్దవాళ్ళు మందలించారు. నాకంటే పెద్దయిన అన్నయ్యకూడా నామీద కేకలు వేశాడు. కాని ఆ అన్నయ్య ఈనాడు తన కూతుర్ని గుంటూరు కాలేజీలో చదివిస్తున్నాడంటే నేను నమ్మలేకపోయాను. ఆనాడే కనక నాకు చదువుకొనే అవకాశం లభించి ఉన్నట్లయితే?

అన్నయ్యకూడా థర్డుఫారంతోనే చదువుకు స్వస్తిచెప్పి వ్యవసాయంలో ప్రవేశించాడు. మా నాన్నగారు పోయి చాలాకాలం అయింది. కాని మా నాయనమ్మ యింకా బతికేవుంది. నాయనమ్మంటే నాకెంతో యిష్టం! తెల్లగా, పొట్టిగా, పల్చగావుండే నాయనమ్మ చిన్నప్పుడు నా కెన్నెన్నో రాజకుమారుల కథలు చెప్పేది.

ఎంతోకాలం తరవాత వచ్చిన నన్ను అందరూ ఎంతో ఆదరంగా ఆహ్వానించారు. అమ్మ సంతోషానికి అంతులేదు. ఏడునుంచి రెండు సంవత్సరాల పిల్లలుగా నాకు తెలిసిన నా మేనకోడళ్లూ, మేనల్లుళ్ళూ ఇప్పుడు నాకంటె పొడవుగా వున్నారు. నాకంటే పెద్ద చదువులు చదువుతున్నారు. నేను వస్తున్నానని తెలిసి వాళ్ళుకూడా వూరికి వచ్చారు. వాళ్ళ మధ్యలో నాకు పల్లెటూళ్ళో ఉన్నట్లుగానే అనిపించలేదు. ఆ ఊళ్ళో చాలామంది ఆడపిల్లలు పెద్ద చదువులు చదువుతున్నారని తెలిసింది. ఊరికే ఉబుసుపోక కబుర్లు చెప్పుకొనే పల్లెమనుషులు- ముఖ్యంగా ఆడవాళ్ళు- ఏ పత్రికలో చదువుతూ తీరికవేళల్ని గడుపుతున్నట్లుకూడా గమనించాను. నేను ఇరవై సంవత్సరాల తర్వాత పుట్టివుంటే ఎంత బాగుండేది అనిపించింది. అలా అయితే యిప్పుడు దాదాపు పదిహేను పదహారు సంవత్సరాల వయస్సు వుండేది. ఎంత చక్కగా స్కూలుకూ, కాలేజీకి వెళ్ళి చదువుకొనే దాన్ని! మా ఊళ్ళో ఒక పెద్ద లైబ్రరీ, సినిమాహాలుకూడా వెలిశాయి.

ఆ రోజు మా మేనకోడలూ, మేనల్లుళ్ళూ గుంటూరు వెళ్ళిపోయారు.

ఏమీ తోచక దొడ్లోకి వచ్చాను. బావి దగ్గర చప్టామీద అమ్మా, నాయనమ్మా కూర్చుని ఏదో దీర్ఘంగా చర్చిస్తున్నట్లు కనిపించారు. నేనూ వాళ్ళ దగ్గిరకెళ్ళి కూర్చున్నాను. ఎవరూ నన్ను పలకరించలేదు. వాళ్ళ ముఖాల్లోకి పరిశీలనగా చూశాను. అమ్మ కళ్ళు వాచివున్నాయి. నన్ను చూడగానే మళ్లీ కళ్ళల్లో నీరు తిరిగినట్లుంది. అక్కడనుంచి గబుక్కున లేచి లోపలకు వెళ్లిపోయింది.

నాయనమ్మద్వారా తెలిసింది. కోడలు అమ్మను బొత్తిగా ఖాతరు చేయడంలేదట. అమ్మ వూరుకోలేక ఏదో చెప్పబోతుందట! వదిన విదిలించి పెడుతుందట!

"అయినా వాళ్ళు ఎలా ఖర్చు చేసుకుంటే మీ అమ్మకెందుకే? మాట విననివాళ్ళకు చెప్పడం ఎందుకు?" అంది నాయనమ్మ.

అమ్మని అలా అన్నందుకు నాకు నాయనమ్మమీద కోపం వచ్చింది. "నువ్వు మాత్రం మా అమ్మమీద ఎంత పెత్తనం చెలాయించలేదు! పాపం, మా అమ్మ ఒక్క నాడయినా పెదవి కదిపిందా?" అన్నాను.

"మీ అమ్మను నేను బాధపెట్టేనటే! నేను పడిన బాధలో మీ అమ్మ ఎన్నోవంతు చూసిందే! మీ అమ్మకు అన్నం సరిగా పెట్టలేదా? వేరే అన్నం వండి పెట్టానా?" అంది

రోషంగా నాయనమ్మ.

నాయనమ్మకు నిజంగానే కోపం వచ్చింది. ఎలాగయినా మాటల్లో దించాలనే ఉద్దేశంతో అన్నాను. "అయితే మీ అత్త నీకు పొట్టనిండా అన్నంకూడా పెట్టలేదా?"

"అవునే అమ్మాయ్! మా అత్తగురించి నీకేం తెలుసే-నన్నెంత కాల్చుకు తిందో!"

"ఎప్పుడో ఒకసారి మీ అత్తగారు మంచిదని చెప్పావ్!"

"ఇప్పుడు మాత్రం కాదన్నానటే!"

"రెండూ నువ్వే చెబుతావ్. మీ అత్త మంచిదో కాదో నేనే నిర్ణయించుకుంటాగాని అసలు కథ చెప్పు" అన్నాను.

కథ చెప్పటం అంటే నాయనమ్మకు ఎక్కడలేని ఓపిక వస్తుంది.

"ఇప్పుడు నా కెన్నేళ్ళే అమ్మాయ్?"

"నీ ఏళ్ళ గురించి ఇప్పుడెందుకులే, మీ అత్తగారి గురించి చెప్పు" అన్నాను కొంచెం విసుగ్గా.

"అంత విసుగయితే ఎట్లాగే? ఇప్పుడు నాకు డెబ్భై ఏళ్ళు అనుకుంటా. అవును. బందరు గాలివానకు ఐదేళ్ళ పిల్లనంట! నా పదమూడో ఏట కాపరానికి వెళ్ళాను. అంటే ఎన్నేళ్ళనాటి సంగతో నువ్వే లెఖ్ఖేసుకో" అనేసి నాయనమ్మ బోసినోటిని చప్పరించసాగింది.

ఇలా లాభం లేదని నేనే ప్రశ్నలు వేశాను.

"నాయనమ్మా! నువ్వు మా తాతయ్యతో పగలు మీ అత్తగారి ముందు మాట్లాడేదానివా?"

"అయ్యబాబోయ్, పగలు కనిపించటమే? మా మామగారు నా పెళ్ళికి ముందే పోయారు. మా అత్తగారిముందు పలకరించటానికి ఆయనకూడా బిడియపడేవారు. ఈ రోజులా పీటలమీద కూర్చునే ఎకసెక్కాలు ఆడుకోవటానికి!"

"వంట నువ్వే చేసేదానివా?"

"కాదే అమ్మాయ్! ఇంటిచాకిరీ, గొడ్లచాకిరీ చేయించేది. కాని వంటింట్లో అడుగెట్టనిచ్చేదికాదు సుమా! మీ తాతయ్యకు మాత్రం సన్నబియ్యం అన్నం వండేది. మంచికూరా, పెరుగు, నెయ్యీ పోసి పెట్టేది. ఆ కూర సరిగ్గా ఒక్క మనిషికి సరిపడానే వండేది."

"మరి మీకో?"

"మాకు నూకల అన్నం వండేది. గోంగూర తొక్కు, లక్షించారు- రోజూ అవే! ఒకోరోజు గిన్నెదగ్గర కూర్చుని ఏడ్చేదాన్ని ముద్ద మింగుడుపడక. దొడ్లో కాసిన కూరలు ఊళ్ళోవాళ్ళకిచ్చేది. ఎంతమందయితే లక్ష్మప్ప అవుతుంది అనేవాళ్ళు" అంటూ నాయనమ్మ గతాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఓ క్షణం మౌనంగా వుండిపోయింది.

"ఆ రోజుల్లో మట్టుగిన్నెల్లో అన్నం తినేవాళ్ళం. మరీ తినలేకపోతే ఆవిడ చూడకుండా గిన్నె అడుక్కు తోసేసి, తిన్నట్టు నటించేదాన్ని. తరవాత కుడితిలో పోసే దాన్ని. రెండుగొడ్ల పాడి వుండేది. ఒక్క నేతిచుక్కగానీ, పెరుగుదొబ్బగానీ ఎరగను. ఆ రోజుల్లో మజ్జిగ అమ్ముకోవడం తెలియదు. పెరుగంతా నాచేతే మజ్జిగ చేయించేది. ముందుగా, చిన్న గిన్నెలోకి మీగడ పెరుగు కొడుక్కు తీసేది. మిగతా కుండెడు పెరుగూ మజ్జిగ చేయించేది. పనిపాటలవాళ్ళకు పోయగా మిగిలింది కుడితితొట్లో పోసేది. మజ్జిగ

తాను కొంచెం పోసుకొని, నాక్కొంచెం పోసేది."

నాయనమ్మ మాటలు విని నాకు చాలా ఆశ్చర్యం కలిగింది.

"పాపం మాటలెందుకు? పాపిష్టిది తనూ తినేది కాదు. నాతోపాటే తినేది. ఒక రోజు దొడ్లోవున్న బొప్పాసకాయ- ఎండిపోవటానికి సిద్ధంగా వున్న కాయకోసి కూరవండింది. అందులో ఒక ఉల్లిపాయ లేదు; మసాలా లేదు. కొడుక్కు రెండు కోడిగుడ్లు ఉడకబెట్టి నేతిలో వేయించి పెట్టింది. నాకు ఆ కూర నోట్లో పెట్టుకుంటే గొంతు దిగలేదు. ఎదురుగా కూర్చొని తను తింటూ "ఒసే పిల్లా! కూర అమృతంగా లేదూ? ఎంచక్కా కుదిరిందో!" అంటూ తినటం మొదలుపెట్టింది. రెండు మొట్టికాయలేసి నా గిన్నెలో కూరకూడా ఆవిడ గిన్నెలో వేసి లేచి పోవాలనిపించింది. పైకి మాత్రం నిజంగా చాలా బాగున్నట్టు ముఖంపెట్టి తినటానికి ప్రయత్నించానే అమ్మాయ్!".

అవొక రోజులు. ఆడవాళ్లు. తిండికూడా మగవాళ్ళతో సమానంగా తినవచ్చని ఊహించలేని రోజులు.

"ఇదంతా తాతకు తెలుసా? ఆమె ఇలా చేస్తుందని ఎప్పుడూ చెప్పలేదా?"

"అయ్యబాబోయ్! నాకు ఆయన్ను చూస్తే గుండెలు పీచు పీచుమనేయ్! ఆయన నన్ను పల్లెత్తు మాట అనడు. అయినా ఎందుకో చాలా భయం వేసేది. పైగా చచ్చేంత బిడియంగా వుండేది. చివర చివరకు ఆయనకూ కొంచెం అర్థం అయిపోయింది. అందుకే గిన్నెలో అన్నంతోపాటు మంచి కూర వండిన రోజున వదిలేసేవారు. "అయ్యో దెస్టపిల్లాడు తినలేదు" అంటూ అందులో సగం తను తీసికొని తినేది."

నేను కూతూహలంగా వింటూ కూర్చున్నాను. నాయనమ్మమీద ఎంతో జాలి ముంచుకొచ్చింది. నాయనమ్మ మళ్ళీ ప్రారంభించింది:

"ప్రతి శనివారం ఒక్క పొద్దు ఉండేదాన్ని. అన్నంవండే బియ్యం నూకతోనే ఉప్పుపిండి చేసుకోమనేది. అదంతకంటే గొంతు దిగేదికాదు. ఒకసారి ఆ ఉప్పుపిండి బాగా కుదిరిందనిపించింది. ముసలిముండ నోటికి కాస్త బాగుంటుందేమోనని ఆవిడకూ పెట్టాను. నోట్లో పెట్టుకుని ఒక్క ముద్ద మింగింది. చేతిలో వున్న ఉప్పుపిండిని పరిశీలనగాచూసి "ఇందులోకి కొబ్బరికాయకూడా బయలెల్లిందే" అంది. నాకు పై ప్రాణాలు పైనే పోయాయంటే నమ్ము! 'నాకు కొబ్బరికాయ ఎక్కడిది?' అన్నాను. ఆమె పలకలేదు. కాని నా మాట నమ్మలేదు. నాకు ఏడుపొచ్చినంత పనయింది. ఆవిడ అలా అంటానికి కారణం మా దొడ్లో కొబ్బరి చెట్టుండేది. చెట్టు నిండా కాయలున్నాయ్. నేను దొంగతనంగా కోసుకొని తింటున్నానేమోనని ఆమె అనుమానం! అవమానంతో ప్రాణం చచ్చిపోయింది. కాని ఒక్క మాట అనలేదు.

"ఒకసారి నిజంగానే కొబ్బరికాయ తినబుద్ధయింది. అప్పుడు నాకు మూడోనెల. మరో రెండునెల్లకే మీ తాతయ్య పోయారు. ఆయన పొలం కెళ్ళారు. ఆయన్ను అడిగితే తప్పక కొబ్బరికాయ కోసి, పగలగొట్టి ఇస్తారు. కాని నాకే సిగ్గు. మధ్యాహ్నం మా అత్తయ్య నిద్రపోతోంది. చిన్నగా దొడ్లోకి వెళ్ళి కొబ్బరికాయ కోశాను. ఆ చెట్టు పొట్టిగా వుండేది. ఒక స్టూలు వేసుకుని ఎక్కితే చేతి కందుతుంది. గుండెలు వేగంగా కొట్టు కుంటున్నాయి. దొడ్డి సందులో కూర్చొని కొబ్బరికాయ పీచు లాగటానికి ప్రయత్నిస్తున్నాను. అంతలోనే "ఒసే పిల్లా!" అంటూ మా అత్తగారు గావుకేక పెట్టింది. నాకు ముచ్చెమట్లు

పట్టాయి. ఏనాడూలేని కక్కుర్తికి ఆనాడు పాల్పడినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను. గాబరాగా లేచి ఆ కాయను గొడ్లతవుడు పోసివుండే పీపాలో దాచాను. గబగబా ఏమీ ఎరగనట్టే లోపలకు పరుగెట్టాను.

"ఏం చేస్తున్నావే దొడ్లో?" అంది ముసల్ది. నన్ను పరిశీలనగా చూస్తూ నా చేతివైపూ, ముఖంలోకీ, చేతికి తవుడు అంటివుందని అప్పుడే తెలుసుకున్న నాకు కాళ్ళు వణికాయి.

"ఏ... ఏంలేదు. కోళ్ళకు కాస్త తవుడు చల్లి వస్తున్నాను" అనేశాను. అంతే, ఆనాడంతా నన్ను ఆ ముసల్ది వెయ్యి కళ్ళతో కనిపెడుతూనే వుంది. పీపాలో కొబ్బరికాయ నా గుండెలమీద బండరాయిలా కూర్చుంది. అది ఎవరైనా చూస్తే ఎంత అప్రతిష్ట! దొంగతిండ్లు తింటున్నానుకోరూ? భగవంతుడా! ఎలాగయినా నన్నీ గండంనుంచి తప్పించు! అంటూ మనసులోనే భగవంతుణ్ని ప్రార్థించాను పదే పదే. ఇంకెప్పుడూ అలాంటి పాడుపని చెయ్యనని మనసులో దేవుడుముందు చెంపలేసుకున్నాను. బాగా చీకటిపడ్డాక ఎలాగో ఆ కాయ అక్కడినుంచి తీసి పెంటకుప్పలో లోతుగా పాతిపెట్టి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను."

నాయనమ్మమీద నాకు జాలేసింది. మళ్లీ ఆమె చెప్పుకుపోసాగింది:

"ఒకరోజు ఆయన వడ్లుపోయటానికి కొత్త గాదె కొనుక్కొచ్చారు. ఇద్దరు కూలోళ్ళను పిలిపించి, మట్టీ, పేడా తొక్కించారు. తను పొలం వెళుతూ వాళ్ళను ఆ గాదె అలికి డబ్బులు తీసుకొని వెళ్లమన్నారు. మా అత్తగారి చేతికి అర్ధరూపాయి యిచ్చి వాళ్ళపని అయాక వాళ్ళకు యిచ్చి పంపేయమని చెప్పి వెళ్ళారు. ఆయన అలా వెళ్ళగానే వాళ్ళిద్దరకూ చెరొక అణా యిచ్చి పంపివేసింది. నన్ను పిల్చి "ఒసే పిల్లా! ఆ గాదె అలికేసెయ్! మట్టి చూడు ఎంచక్కా మెత్తగా తొక్కి వెళ్ళారో! కూస్త సేపట్లో అయిపోద్ది" అని పురమాయించింది. నేను గాదె అలకటం మొదలుపెట్టాను. కొత్త మేదర వెదురుబద్దలు చేతుల్ని చీలుస్తున్నాయి. అరిచేతులమంట నసాళానికి అంటుతున్నది. కిక్కురుమనకుండా ఉబుకుతున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అలికాను."

"మరి ఆ విషయం తాతయ్యకు తెలియలేదూ?"

"ఎలా తెలుస్తుంది? ఎవరు చెబుతారు? కూలోళ్ళను మా అత్తగారు బెదిరించి మరీ పంపించారు. తెల్లవారి వాళ్ళను వచ్చి మజ్జిగపోయించుకెళ్ళమనికూడా చెప్పింది. మా పుట్టింట్లో యిటువంటి పనులుచేసి ఎరగను. పైగా చిన్న ముండను; నేనెంత నా ఆయెంత! దొడ్లో ఉన్న బీరపాదులకూ, పొట్లపాదులకూ పందిళ్ళు వేయించేది. మళ్ళీ అక్కడ సరిగా లేదని అంతా వూడదీయించి, మరికొంచెం ఆ పక్కకూ, ఈ పక్కకూ జరిపి వేయించేది. ప్రతి మధ్యాహ్నం యిలాంటి పనేదో నా కోసం వెతుకుతూనే వుండేది. పాదాల పారాణి పూర్తిగా ఆరకముందే ఆయన పోయారు. ఆ తరువాత నాలుగు నెలలకు మీ నాన్న పుట్టాడు. వాడంటే మా అత్తకు ఎంత ప్రేమనుకున్నావ్! నన్ను మాత్రం అట్లాగే చూసేది. 'పాతికేళ్ళ ఆయన్ను నానుంచి తీసుకెళ్ళి అరవైయేళ్ళ ముసల్దాన్ని నాకు వదిలేశావా భగవంతుడా?' అనుకుంటూ కంటికి కడివెడుగా ఏడ్చేదాన్ని, మీ తాతయ్య పోయాక వేరే కూరలూ, నారలూ వండాల్సిన పనికూడా లేకుండాపోయింది. వంటపని నాకు అప్పగించింది. ఒకరోజు అన్నం పెడతానంటే తొందరేం అంది. అలా అందికదా అని రెండోనాడు కొంచెం ఆలస్యం చేశాను. కోడి ఆమె దగ్గరకొచ్చింది. తను అన్నం

తినేప్పుడు కోడికి కొంచెం వేసే అలవాటుంది. "వచ్చావ్! నీ ఇంట పీనుగెల్లా! నాకొకటేడ్చిందీ నీకు వెయ్యటానికి?" అంది. అప్పటికే ఆమెకు చాలావరకు ఓపిక తగ్గిపోయింది నేను కిక్కురుమనకుండా అన్నంగిన్నె తెచ్చి ముందుపెట్టాను. "ఒసే అమ్మాయ్! అన్నిటికంటే నన్ను బాధపెట్టిన సంగతి చెప్పనా?" అంది నాయనమ్మ.

చెప్పమన్నాను కుతూహలంగా.

"తలంటి పోసుకోవాలంటేకూడా భయమే. నూనెకూడా తనే వేసేది అరిచేతులో. కుంకుడుకాయలు రెండు నానవేసి ఒక్కొక్క చుక్కే తల రుద్దుకుంటుంటే పోసేది. ఎంత రుద్దుకొన్నా తల మురికిగానీ, చమురుగానీ పోయేదికాదు. ఏడుపొచ్చేది. ఇకచాల్లే అనేది పూర్తినూనె వదలకుండానే. నీళ్ళుకూడా తొలిపి చెంబులో అందించేది. పోనీయ్ ఆ నీళ్ళయినా పోసుకోనిచ్చేదా! "ఒసే పిల్లా! అట్టావచ్చి ఆ పొట్లపాదు దగ్గర కూర్చో" అనేది. రెండు చెంబులు పోసుకోగానే "ఆ బీరపాదు దగ్గరకు రా!" అనేది. మరో రెండు చెంబులు పోసుకోగానే "ఇక ఇక్కడ చాల్లే. ఆ వంగ మొక్కలు ఎండిపోతున్నాయి, అక్కడకు పద!" అనేది. నాకు దుఃఖం పొర్లుకొచ్చేది. సిగ్గుతో భూదేవి గుండెల్లో ముఖం దాచుకోవాలనిపించేది."

నాకు నవ్వాగింది కాదు. పొట్ట చేత్తో పట్టుకొని నవ్వసాగాను.

"ఇప్పుడు నీకు నవ్వుగానే వుంటదే! పిల్లకాకికేం తెలుసు ఉండేలు దెబ్బ! పాత ధోవతితోనో, చీరతోనో ఒళ్లు తుడుచుకుంటే అనేది 'మా కాలంలో మేం ఎరగమమ్మా ఈ ఒళ్ళు తుడుచుకోవటాలేంటో!' అనేది చోద్యంగా చూస్తూ. మధ్యాహ్నం మరీ తోచ నప్పుడు పక్కింటి బంగారమ్మ కూతుర్తో గవ్వలాడుకొనేదాన్ని. 'ఏం గవ్వలే పిల్లా! కూటికా గుడ్డకా? డబ్బుకా దమ్మిడీకా? అంటూ ఇట్టా ఇట్టా చేత్తో చిమ్మేసేది" అంటూ నాయనమ్మ వాళ్ళత్త గవ్వలెట్లా చిమ్మేసేదో యాక్షన్‌చేసి చెబుతుంటే మళ్ళీ నవ్వొచ్చింది.

"మరి మీ అత్త మంచిదన్నావ్!"

"మంచిదేనే! నా బిడ్డకు ఏం తక్కువవుతోందోనని అల్లాడిపోయేది. తమ్ముడు తిండిలేక నానావస్థ పడుతున్నా ఒక్క ఎర్రనేగానీ సహాయం చేసేదికాదు. మంచం పట్టింది. అప్పుడుకూడా నేను ఆమె మాటకు ఎదురు చెప్పలేదు. ఒకసారి దగ్గరకు పిల్చి "ఒసే పిల్లా! ఒకేళ ఈ పాడు ప్రాణం మంగళారంనాడు పోద్దో ఏమో! నీకు అసలేం తెలవదు. ఇంతలావుదాన్ని వేసేవ్. పావలా ఎట్టి చిన్న పిల్లను తెచ్చేయ్" అంది. నేను "చాల్లే ఊరుకుందూ!" అన్నాను.

ఆ పిల్లేమిటో అర్థంకాక నేను తెల్లముఖం వేసి నాయనమ్మ బోసి నోటివైపు చూశాను.

"అంటే అర్థంకాలా! మంగళవారం చచ్చిపోతే కోడిపెట్టను వేస్తారు. చిన్నపిల్లను వేస్తే చాలని చెప్పింది. ఒసే పిల్లా! నువ్వసలే తెలివి తక్కువదానివి. దినానికి గంగాళాలు వండి వార్చేవు సుమా, ఓ కుంచెడు వండు చాలు" అనేది.

ఆ మాటలు విని నాకు ఆశ్చర్యం వేసింది. అవును. ఆమె మంచిదే. ఆమె స్వార్థంతో అలా ప్రవర్తించలేదు. ఆ పల్లె వాతావరణంలో అజ్ఞానంలో పుట్టి పెరిగిన ఆమెకు అంతకంటె మంచిగా ఎలా ప్రవర్తించాలో, బ్రతకాలో తెలియదు.

"ఏ మాట కామాటే, మీ అమ్మకూడా ఈనాటికీ నా మాటకు ఎదురు చెప్పదేవ్.

కాని కోడలుదాన్ని నోరు తెరవనియ్యదు. కలికాలం ప్రవేశించింది. కోడళ్ళు అత్తలకు ఎదురుతిరుగుతున్నారు" ఆ చివరి మాటలు నాయనమ్మ తనకు తనే చెప్పుకుంటున్నట్లుంది.

"అవును నాయనమ్మా! ఒకోతరం మారుతుంది. విజ్ఞానం పెరుగుతుంది. నీ తరంలో ఆడవాళ్ళు మగవాళ్ళతో సమంగా తిండికూడా తినకూడదు. అమ్మతరం వచ్చేటప్పటికి కొంత మారింది. అమ్మతరంలో ఆడది అత్తమామల, భర్త అదుపాజ్ఞల్లో అణిగిమణిగి పడివుంటే చాలు. కాని మా తరంలో చాలా మార్పు వచ్చింది. యుగ యుగాలుగా అణచబడిన స్త్రీ ఎదురు తిరుగుతుంది. అందుకే అత్తమామలంటే పెద్ద గౌరవం లేదు. కాని మా పిల్లలతరం వచ్చేటప్పటికి ఇంకా మార్పులొస్తాయి. ఈనాడు చదువుకుంటున్న పిల్లలు రేపు కోడళ్ళూ, ఎల్లుండి అత్తలూ అవుతారు. వాళ్ళు అత్తలయ్యేప్పటికి అత్తా కోడలు ఒకరి వ్యక్తిగత విషయాల్లో మరొకరు పట్టించుకోకుండా, ఒకర్నొకరు అర్థం చేసుకొని బ్రతకటానికి ప్రయత్నించవచ్చును."

చిత్రంగా చూస్తుండిపోయింది నాయనమ్మ.

"మా అమ్మ చదువు గురించి ఎవరూ ఆలోచించలేదు. నా చదువు గురించి నేను ఆలోచించాను. కాని మీరంతా నా ఆలోచన్నే తప్పుగా భావించారు. ఇప్పుడు పిల్లల చదువు గురించి పెద్దలుకూడా ఆలోచిస్తున్నారు. ఈ ఊరి ఆడవాళ్ళు నా చిన్నప్పుడు జుట్లు జుట్లు పట్టుకొనేవారు. ఒకరిమీద ఒకరు చెప్పుకొనేవారు. వాళ్ళకు వేరే వ్యాపకం వుండేదికాదు. కాని ఇప్పటివాళ్లు, అంటే నా ఈడువాళ్ళు ఈ పల్లెటూర్లో కూడా వారపత్రికలూ, మాసపత్రికలూ తెగ చదువుతున్నారు. అందులో వచ్చే కథల్ని గురించి మాట్లాడుకుంటున్నారు. తీరిక సమయాల్లో మహిళా సంఘాలంటూ, లైబ్రరీ అంటూ నలుగురూ ఒకచోట చేరుతున్నారు. ఇదంతా చూస్తుంటే నాకు చాలా సంతోషంగా వుంది. కాకపోతే ఒకటే బాధిస్తుంది నన్ను. ఆనాడే నన్ను మీరంతా చదివించివుంటే ఇప్పుడు ఓ పెద్ద డాక్టర్నయి ఇలాంటి పల్లెటూర్లకు సేవ చేసి వుండేదాన్ని గదా అని."

అమ్మ అన్నానికి పిలవటంతో మా సంభాషణ ఆగిపోయింది.

(మార్చి 1969, అన్నదాత మాసపత్రిక)